
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 136 వ భాగం

## సూర్య వంశం – 4; చ్యవనుడు

.

ముసలితనం పోయిన చ్యవనుడు భార్యతో సుఖంగానే ఉన్నాడు ఆయన ఆశ్రమంలో. రాజ్యం చేస్తున్న శర్యాతికి ఇక్కడ జరిగిన విషయాలు తెలియవు. ఓ రోజు యజ్ఞం చేయడానికి ముహూర్తం పెట్టుకుని అల్లుణ్ణీ కూతుర్నీ పిలుచుకు రావడానికి వచ్చాడు ఆశ్రమానికి.

సీ.యాగంబు చేయంగ నర్థించి శర్యాతి
చ్యవనమునీంద్రు నాశ్రమము కడకుఁ
గూఁతు నల్లునిఁ దోడుకొనిపోవు వేడుక
వచ్చి పుత్రికకుఁ బార్శ్వంబు నందు
సూర్యతేజంబున సొంపారు వరుఁ గని
"వీ డెవ్వఁడో దీని విభుఁడు గాఁడు,
చెల్లరే!"యని పుత్రి చేసిన ప్రియములు
మొక్కులు నొల్లక మోము వాంచి [9-62]

తే.మాఱుమాటాడ దీవింప మనసు రోసి
చ్యవనుఁ డధికుండు మునిజన సత్తముండు
భువన సన్నుతుఁ డతఁ డెందు బోయె నాతఁ
డెట్లు వంచింపఁబడియె? వీఁడెవ్వఁ? డబల! [9-62.1]

వచ్చిన శర్యాతికి కూతురూ, పక్కనే సూర్యతేజస్సుతో ఉన్న మరో యవ్వనంలో ఉన్న కుర్రాడూ (సూర్యతేజంబున సొంపారు వరుడు) కనిపించారు. అప్పట్లో ఉన్న ధర్మం ప్రకారం భార్యా భర్తలు ఇద్దరూ ఒకరినొకరు మోసం చేసుకోకుండా బతికి ఉండాలనేది అనుకున్నాడు శర్యాతి. ఇక్కడ కనిపిస్తున్న వీడెవడో సుకన్య భర్త కాదు అనుకుని కూతురు చేసిన మర్యాదలకి మనలో అసహ్యించుకున్నాడు. చ్యవనుడైతే తపస్సంపన్నుడు; ఆయన ఎక్కడకి వెళ్ళాడో? అంతటి మహర్షిని ఎలా మోసగించావు? ఇక్కడున్న వీడు ఎవరు? ఇలా చేయవచ్చా? ఇదంతా మనసులో అనుకుంటూ చెప్తున్నాడిప్పుడు.

మ. తగవే? ధర్మమె? శీలమే? కులజ వై, దర్పించి మోదింప, నా
జగదారాధ్యునిఁ, బుణ్యశీలుఁ, దపసిన్, సాధ్వీమనస్సమ్మతున్,
మగనిన్ మాని, భుజంగుఁ బొందఁ దగునే? మానంబు వాటింపఁగా
దగదే? దుర్గతిఁ ద్రోచితే కఠిన వై తండ్రిం బతిం గూఁతురా! [9-63]

ఇది తగునా? ధర్మమేనా? నీ శీలం ఏమైంది? ఉత్తమ కులంలో పుట్టినదానివి అయ్యి, ప్రపంచం అంతా ఆరాధించేవాడూ, పుణ్యశీలుడూ, తపస్వీ, మంచి మనస్సు ఉన్న మగణ్ణి వదిలేసావా? అలా చేయడం మంచిది కాదే? అలా చేస్తే దుర్గతిలో పడతావు కదా? పరమ కోపిష్టి అంటూ పైన చెప్పిన పద్యంలో చ్యవనుడు సాధ్వీమనస్సమ్మతుడు ఎలా అయ్యాడు ఇక్కడ? ఒక్కొక్కరి మనఃస్థితి బట్టి అవతలివాళ్ళెలా ఉంటారో అది వారి అంచనా. శర్యాతి తన కూతురు పుట్టలో జ్యోతులు పొడిచాక ఈయనని వేడుకుంటే 'సరే ఆవిణ్ణి నాకు భార్యగా ఇచ్చి వెళ్ళు' అని శపించకుండా ఊరుకున్నాడు కనక చ్యవనుడు ఆయనకి సాధ్వీమనస్సమ్మతుడు. పడుచు భార్య దగ్గిరగా ఉన్నప్పుడు ఆవిణ్ణి సుఖపెట్టలేక దూరంగా ఉంచడం కోసం కోపం చూపించాడు కనక అప్పుడు పరమకోపిష్టి గా మసులుకుని ఉండొచ్చు.

ఆ.పద్మనయన! మగఁడు ప్రాయంపు వాడైనఁ
గాపు పెట్టి కొంతఁ గావ నేర్చుఁ
గడఁగి ముసలి తపసి గావంగ నేర్చునే
యువతి ముదుకఁ గూర్ప నొప్ప దెందు. [9-64]

ఇంత చెప్పాక నా తప్పు కూడా ఉందిలే అంటున్నాడు. అయినా ముసలివాడికి ఇచ్చి పెళ్ళి చేస్తే ఆయన నిన్ను ఏం కాపాడగలడు. వయసులో ఉన్న మగడు అయితే బాగుండేది కదా?

వ. అని పలికిన నప్పరమప్రతివ్రతాలలామంబు చిఱునగవు చెక్కుటద్దంబులఁ జిడిముడిపడఁ దండ్రి కిట్లనియె. [9-65]

క. నియ్యల్లు డితఁడు భార్గవుఁ
డయ్యా! జారుండు గాఁడు; హర్షముతోడన్
నెయ్యంబు నిల్పు మంచును
దొయ్యలి సర్వంబుఁ దండ్రితో వినిపించెన్. [9-66]

తండ్రి ఇలా అనేసరికి కూతురికి నవ్వు వచ్చింది. పై వచనంలో సుకన్యని ఏమన్నాడో గమనించారా? పరమపతివ్రతాలలామము (లలాలము – శ్రేష్టురాలు). ఈయన నీ అల్లుడైన చ్యవనుడే (భార్గవుడు), ఎవరో జారుడు (రంకుల వాడు) కాదు. అలా జరిగిన కథ మొత్తం చెప్పింది తండ్రికి.

వ. అంత శర్యాతియు నప్రమత్తుండై, కూఁతుం గౌగలించుకొని, గారవంబున "నయిదువవు గ" మ్మని దీవించె; నంత భార్యాసహితుండై చ్యవనుండు చని, తన మామకు యాగంబు చేయించి, యొక్క పాత్రంబున సోమభాగంబుఁ బట్టి, నిజ తపోబలంబున నశ్విదేవతల కర్పించినం జూచి. [9-67]

అలా శర్యాతి మొత్తం కథ అంతావిని సంతోషంగా ఇద్దర్నీ దీవించి కూడా తీసుకెళ్ళాడు యాగానికి. మామగారికి యాగం చేయించాక చ్యవనుడు యాగంలో సోమపానం ఒకపాత్రలో పెట్టి తన తపోబలంతో అశ్వినీదేవతలని పిలిచి వారికి అర్పించాడు. ఇది ఇంద్రుడుకి సహించలేదు.

క. కోపముతోడను వాసవుఁ
దేపున ముని పైని వజ్రమెత్తిన, మరలం
దాపసుఁడు వజ్రిభుజమున,
నా పవి నిలిపెన్ జగంబు లాశ్చర్యపడన్. [9-68]

వాసవుడు – ఇంద్రుడు, ఇలా సోమపానంలో భాగం చ్యవనుడు ఆశ్వినీ దేవతలకి ఇవ్వడం సహించలేక వజ్రాయుధం ఎత్తాడు చ్యవనుడిమీదకి. అయితే ఈయన ఆ వజ్రం ఇంద్రుడి భుజానికి అతుక్కుపోయేలాగా అక్కడే ఉంచాడు తన తపఃశ్శక్తితో మూడు జగత్తంతా ఆశ్చర్యపడేలాగా.

వ. ఇవ్విధంబున నశ్విదేవత లిద్దఱు వైద్యులై, సోమపానంబు లేని వారయ్యుఁ, జ్యవను సామర్థ్యంబునఁ బ్రాప్తభాగులయి చనిరి; శర్యాతికి నుత్తానబర్హియు, నానర్తుండును, భూరిషేణుండు నను మువ్వురు గొడుకులు గలిగి; రందు. [9-69]

అలా చ్యవనుడు తానిచ్చిన మాట నిలబెట్టుకున్నాక, దేవతలకి వైద్యులైనా సోమపానానికి అర్హత లేనప్పుడు చ్యవనుడి వల్ల అర్హత సంపాదించారు. ముందు కథలో ఈ సుకన్య పుట్టలో పుల్లబెట్టి పొడవడం అనేది దైవ వశం వల్ల అన్నాడు కదా. దానికి సమాధానం ఇదే. ఆవిడ వల్ల ఈ అశ్వినీదేవతలకి సోమపానం లో భాగం రావాల్సి ఉంది. దానికి యాగంలో చేయల్సిన పద్ధతులు సరిగ్గా చెప్పగలవాడైన శర్యాతి; యాగం చేయించే చ్యవనుడూ కారకులయ్యారు.

శర్యాతికి పుట్టిన ముగ్గురు కొడుకుల వరస, వాళ్ళ సంతతీ ఇప్పుడు క్లుప్తంగా చెప్తున్నాడు. వీళ్ళలో మొదటివాడు ఆనర్తుడి కొడుకు రైవతుడు.

సీ. ఆనర్తునకు రైవతాహ్వయుం డుదయించె
నతఁడు కుశస్థలి యను పురంబు
నీరధిలోపల నిర్మించి; పెంపుతో
నానర్తముఖ విషయంబులేలె;
గనియెఁ గకుద్మి ముఖ్యంబైన నందన

శతము; రైవతుఁడు విశాలయశుడు,
దన కూఁతు రేవతి ధాత ముందటఁ బెట్టి
తగు వరు నడిగెడి తలఁపుతోడ [9-70]

తే. గన్యఁ దోడ్కొని బ్రహ్మలోకమున కేగి
యచట గంధర్వ కిన్నరు లజుని ప్రోల
నాటపాటలు సలుపఁగ, నవసరంబు
గాక నిలుచుండె, నతఁ డొక్క క్షణము తడవు. [9-70.1]

రైవతుడు కుశస్థలి అనే నగరం సముద్రంలోపల కట్టి (నీరధిలోపల) రాజ్యం చేసాడు. ఆయన వందమంది కొడుకులతో పాటు రేవతి అనే కూతురు పుట్టింది. ఆవిడకి కాబోయే భర్త ఎవరో తెలుసుకుందామని రేవతితో పాటు బ్రహ్మ దగ్గిరకి వెళ్ళాడు. అక్కడ బ్రహ్మ ముందు గంధర్వులు కిన్నరులూ ఆటపాటలు జరుపుతూ ఉంటే, సరే ఇవి అయ్యాక అడుగుదాం అని ఒక క్షణం వేచి చూసాడు.

ఆ. చాల ముద్దరాలు, జవరాలుఁ గొమరాలు
నీ శుభాత్మురాలి కెవ్వఁ డొక్కొ
మగఁడు? చెప్పు" మనిన యది చూచి పకపక
నవ్వి భూమిపతికి నలువ పలికె. [9-72]

చాలా అమాయకురాలు, యవనంలో ఉన్నదీ, అయిన ఈ అమ్మాయికి మొగుడు ఎక్కడ దొరుకుతాడో చెప్పండి అని అడిగాడు బ్రహ్మని. ఇది విని బ్రహ్మ పక పక నవ్వి చెప్తున్నాడు.

సీ. మనుజేశ! దీనికై మదిలోనఁ దలఁచిన-
వార లెల్లను గాలవశతఁ జనిరి;
వారల బిడ్డల, వారల మనుమల-
వారల గోత్రంబు వారినైన

వినము మేదిని మీఁద; వినుము, నీ వచ్చిన-
యీలోన నిరువదియేడు మాఱు
లొండొండ నాలుగు యుగములుఁ జనియె; నీ-
వటు గాన ధరణికి నరుగు; మిపుడు [9-73]

తే. దేవదేవుండు హరి, బలదేవుఁ డనఁగ
భూమి భారంబు మాన్పంగఁ బుట్టినాఁడు;
సకలభూతాత్మకుఁడు నిజాంశంబుతోడ
యువతిమణి నిమ్ము జనమణి కున్నతాత్మ!" [9-73.1]

నువ్వు ఇక్కడకి వచ్చి క్షణకాలం నించున్న వేళలో భూమ్మీద ఇరవైఏడు సార్లు నాలుగు యుగాలు గడిచిపోయాయి. అందువల్ల ఇప్పుడు భూమ్మీదకి వెళ్ళి చూడు. నారాయణుడు తన అంశతో బలదేవుడు అనే పేరుతో పుట్టి ఉన్నాడు (కృష్ణుడి అన్న లేదా బలరాముడు) ఆయనకి ఈవిడని భార్యగా ఇయ్యి.

వ. అని యానతిచ్చిన బ్రహ్మకు నమస్కరించి, భూలోమునకుఁ జనుదెంచి, సోదర స్వజన హీనంబగు తన నగరంబున కా రాజు వచ్చి, బలభద్రుం గాంచి, రేవతీకన్య నతని కిచ్చి, నారాయణాశ్రమంబగు బదరికావనంబునకు నియమంబునఁ దపంబు జేయం జనియె. [9-74]

రైవతుడు బ్రహ్మకి నమస్కారం చేసి భూమ్మీదకి వచ్చేసరికి తన వాళ్లంటూ ఎవరూ లేరు. రేవతిని బలరాముడికి ఇచ్చి బదరికాశ్రమానికి వెళ్ళాడు తపస్సు చేసుకోవడానికి. గమనించారా, ఇలా వంశంలో పుట్టిన రాజులందరి గురించీ చెప్పడం లేదు కధ. భగవంతుడి విభూతి, లీలలు తెలిపేవి మాత్రమే శుకమహర్షి చెప్తున్నాడు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS